సాక్షి మంచిర్యాల

గురువారం । 30 । మార్చి । 2023




అభివృద్ధి పనులకు భూమి పూజ
మంచిర్యాల, నస్పూర్ పట్టణాల్లోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు భూమి పూజ చేశారు. నస్పూర్‌లో హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. 11లో▸



ఫలం.. పోషకాలు పుష్కలం
రంజాన్ మాసం వచ్చిందంటే పండ్లకు భలే గిరాకీ. ఇఫ్తార్ దీక్ష విరమణకు ముస్లింలు ఎక్కువగా వీటినే ఇష్టపడుతారు. పోషకాలు అధికంగా అందుకు కారణం ఉండడమే. 10లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
37.0 /25.0
ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉత్తరం దిశగా వేడిగాలులు వీస్తాయి. ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉంది.



రైతుల డబ్బులు వచ్చేనా?



ప్రైవేటు డెయిరీ పాడి రైతుల రిజిస్ట్రేషన్ కోసం నిర్వహించిన కార్యక్రమం(ఫైల్)



పాడిగేదెలు

పాల డెయిరీ ప్రారంభమవుతుందని ఆ సంస్థ సిబ్బంది చెబితే బెల్లంపల్లి పట్టణానికి చెందిన శివ చక్రవర్తి పాల వ్యాపారం చేయాలనుకున్నాడు. ఆ సంస్థలో చేరి పాడిగేదెలు తీసుకుని స్వయం ఉపాధి పొందాలని అనుకున్నాడు. తన స్థాయి మేరకు రూ.2లక్షల యూనిట్‌ను ఎంపిక చేసుకుని రెండు గేదెల కోసం రూ.70వేలు చెల్లించాడు. మిగతా రూ.1.30లక్షలు రుణం రూపంలో కంపెనీ ఇస్తుందని చెబితే బ్యాంకులో డబ్బులు వేశాడు. అనుకున్నట్లుగా జరిగితే గేదెలు ఇచ్చాక రుణం వాయిదాల పద్ధతిలో చెల్లిస్తూ పాలను సంస్థకు పోయాలి. డబ్బులు చెల్లించి నెలలు గడుస్తున్నా గేదెలు ఇవ్వకపోవడంతో గత జనవరిలో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇక అప్పటి నుంచి డబ్బులు కట్టి నష్టపోయామని, తమ డబ్బులు వస్తాయో లేదోనని ఆందోళన చెందుతున్నాడు.

బెల్లంపల్లి పట్టణానికి చెందిన మర్రి రవికుమార్, తన సమీప బంధువు అమ్ముల కుమారస్వామి ఇద్దరు కలిసి పాల వ్యాపారం చేద్దామనుకున్నారు. ప్రైవేటు డెయిరీ చెప్పిన స్కీంలో ఐదు గేదెలు తీసుకోవాలని అనుకున్నారు. ఈ యూనిట్‌లో రైతు వాటాగా ఒక గేదెకు రూ.35వేల చొప్పున ఐదింటికి రూ.175లక్షలు చెల్లించారు. మిగతా మొత్తం రూ.3.25లక్షలు రుణం రూపంలో రైతు కంపెనీకి వాయిదా పద్ధతిలో చెల్లించాలి. పాల ఉత్పత్తిదారులుగా ఉంటూ తీసుకున్న రుణం ఇవ్వాలని చెబితే ఖాళీ చెక్కులు సైతం ఇచ్చారు. ఇందులో కుమారస్వామి తమ ఇంట్లో బంగారం అమ్మి పెట్టుబడి పెట్టాడు. గేదెలు ఇస్తారని హామీ ఇవ్వడంతో తమ భూమిలో ఓ షెడ్డు కట్టేందుకు సిద్ధమయ్యారు. అనుకున్న సమయానికి గేదేలు ఇవ్వకపోగా, సంస్థ నుంచి సరైన సమాధానం రాకపోవడంతో చివరకు పోలీసుస్టేషన్‌లో కంపెనీ ప్రతినిధులపై ఫిర్యాదు చేశారు.

- ప్రైవేటు డెయిరీలో రూ.లక్షలు పెట్టుబడి
- కట్టిన డబ్బులు కోల్పోతామేమోనని ఆందోళన
- స్వయం ఉపాధి పొందాలనుకున్నవారికి నిరాశే

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ప్రత్యేక ఆఫర్లతో పాడి రైతులను ఆకర్షించి డబ్బులు వసూలు చేసిన ఘటనలో రైతులు ఆగమాగం అవుతున్నారు. తమకు గేదెలు ఇవ్వకపోగా కట్టిన డబ్బులు తిరిగి తీసుకునేందుకు బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది జూలై నుంచే జిల్లాలో భారీ స్థాయిలో డెయిరీ కంపెనీ నెలకొల్పుతామని ఆశలు చూపడంతో అనేకమంది నమ్మారు. ఇందులో కొందరు డబ్బులు చెల్లించారు. వీరిలో ఒకరిద్దరికి గేదెలు ఇవ్వగా.. ఎక్కువ మందికి ఇంకా పాడిపశువులు అందాల్సి ఉంది. నెలల తరబడి వేచి చూస్తున్న పాల ప్లాంటు ఏర్పాటు కాకపోవడం, అటు గేదెలు కూడా ఇవ్వకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. దీంతో చివరిగా పోలీసుస్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. తాజాగా జరుగుతున్న వివాదాలతో రైతుల పరిస్థితి దారుణంగా మారింది. పెట్టుబడి, రిజిస్ట్రేషన్, బీమా పేరుతో వసూలు చేసిన సొమ్ము రైతులు కోల్పోయినట్లుగా అవుతోంది.

ఏజెంట్లు, ఉద్యోగులతో ప్రచారం

పాడి రైతులను ఆకర్షించేందుకు పశుసంవర్ధక శాఖలో గత కొన్నేళ్లుగా పని చేస్తున్న గోపాల మిత్రలతోపాటు మరికొందరు సిబ్బందినే డెయిరీలో ఉద్యోగులుగా చేర్చుకున్నారు. ప్రభుత్వ శాఖలోని వారే ప్రచారం చేయడంతో అందరూ నమ్మారు. చివరకు అటు గేదేలు అందక, ఇటు డబ్బులు తిరిగి పొందలేక అనేక మంది రైతులు అవస్థలు పడుతున్నారు. దాదాపు 50మంది వరకు కనీసం రూ.70వేల నుంచి రూ.3.50లక్షల వరకు చెల్లించిన వారు ఉన్నారు. గత జనవరిలో జిల్లా వ్యాప్తంగా బెల్లంపల్లి, తాండూరు, కాసిపేట, భీమారం, నెన్నెల, లక్సెట్టిపేట, జన్నారం, తాండూరు పరిధిలో నిర్వాహకులపై కేసులు నమోదయ్యాయి. మరోవైపు నిర్వాహకులు సైతం గేదెలు తీసుకుని డబ్బులు చెల్లించలేదని, ఇద్దరిపై ఫిర్యాదు చేసిన ఘటనలు ఉన్నాయి. తాజాగా జరుగుతున్న పరిణామాలతో తమ డబ్బులు తమకు తిరిగి వస్తాయో లేదో తేల్చుకోలేని స్థితిలో బాధితులు ఉన్నారు. డబ్బులు చెల్లించిన వారిలో నిరుపేద రైతులు ఉండగా, మరికొందరు పెద్ద వ్యాపారులు కూడా ఉన్నారు. ప్రస్తుతం నిర్వాహకులపై కేసుల్లో కొన్నింటిపై బెయిల్ వచ్చింది. మరికొన్నింటిలో బెయిల్ రావాల్సి ఉంది. ఇంకా కేసు దర్యాప్తు సాగుతోంది.

పాఠశాల స్వచ్ఛంద నియామకాల్లో గందరగోళం

- విద్యాశాఖ అప్రమత్తం
- కేర్ ఫౌండేషన్ లేఖలపై ఆరా

మంచిర్యాలఅర్బన్: సర్కారు బడుల్లో స్వచ్ఛంద నియామకాల్లో గందరగోళం ఏర్పడింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద సర్కారు బడుల్లో డిజిటల్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్, స్వీపర్ నియామకం చర్చనీయాంశంగా మారింది. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు విద్యాంజలి 2.0లో అదానీ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్, ఏపీఎల్ హెల్త్ కేర్ ఫౌండేషన్ సంస్థలు అపాయిమెంట్ చేసిన వారిని ఉద్యోగులుగా జాయిన్ చేసుకోవాల్సి ఉంది. ఇదే అదునుగా భావించి మరో సంస్థ కేర్ ఫౌండేషన్ పేరిట కొందరికి నియామక ఉత్తర్వులు ఇవ్వడం, చేరడానికి రావడంతో జిల్లా విద్యాశాఖ అప్రమత్తమైంది. కేర్ సంస్థ పేరిట జారీ చేసిన నియామక ఉత్తర్వులతో వచ్చిన ఉపాధ్యాయులను చేర్చుకోవద్దని హెచ్‌ఎంలకు డీఈవో వెంకటేశ్వర్లు బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

నియామకాలపై ఆరా..
కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్‌ఆర్) కింద సర్కారు బడుల్లో అవసరాల మేరకు బోధన, బోధనేతర సిబ్బందిని స్వచ్ఛంద సంస్థలు నియమించా యి. ఫిబ్రవరి 22న ఎనిమిది మంది ఆయా పోస్టుల్లో చేరారు. స్థానిక జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, బెల్లంపల్లితోపాటు పలు పాఠశాలల్లో అదానీ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సంస్థ నియమించిన వారు విధులు నిర్వర్తిస్తున్నారు. బుధవారం బాలుర ఉన్న త పాఠశాలలో కేర్ ఫౌండేషన్‌తో మరో ఇద్దరు రావడంతో విద్యాశాఖకు సమాచారం అందించారు. మందమర్రి పట్టణంలోని ఓ పాఠశాలకు కూడా కేర్ ఫౌండేషన్ లెటర్‌తో వచ్చినట్లు తెలుస్తోంది. స్వచ్ఛంద నియామకాలు 'మామూలు'గా సాగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే అలాంటి సంస్థ పేరిట వ చ్చిన వారిని చేర్చుకోవద్దని ఆదేశాలు జారీ చేశారు. ఇదివరకు విధుల్లో చేరిన వారిలో ఎవరైనా ఉన్నారా.. అనే దానిపై ఆరా తీశారు. చేరిన వారిని కూడా రిలీవ్ చేయాలని డీఈవో వెంకటేశ్వర్లు ఆదేశించారు. పాఠశాలల్లో చేరిన వారి వివరాలు అపాయింట్‌మెంట్ లెటర్, జాయినింగ్ రిపోర్టులను జిల్లా విద్యాశాఖ కార్యాలయం సమన్వయ అధికారి చౌదరికి 83283 63596 నంబరులో అందజేయాలని సూచించారు.

న్యూస్‌రీల్

'మన బడి' ప్రారంభానికి సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

పాతమంచిర్యాల: ప్రభుత్వం చేపట్టిన మన ఊరు–మన బడి, మన బస్తీ–మన బడి కార్యక్రమాల్లో మొదటి విడత పాఠశాలల్లో చేపట్టిన పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. కలెక్టర్ చాంబర్‌లో బుధవారం ఆయన జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, ట్రెయినీ కలెక్టర్ గౌతమి, విద్యాశాఖ, ఏజెన్సీ అధికారులతో కలిసి పాఠశాలల అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంకా పనులు పూర్తి కాని పాఠశాలలకు సంబంధించి గ్రౌండింగ్ వర్క్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఏజెన్సీ ఇంజినీర్లు, ఎంఈవోలు, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీఏ కార్యాలయంలో డీటీసీ తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న డీటీసీ శ్రీనివాస్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లిలోని జిల్లా రవాణా శాఖా కార్యాలయంలో బుధవారం సాయంత్రం జిల్లా రవాణా శాఖా ఉప కమిషనర్ డాక్టర్ పుప్పాల శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో వివిధ రకాల రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీసి తీరు మార్చుకోవాలని సూచనలు చేశారు. విధుల నిర్వహణలో పారదర్శకత ఉండాలని, వివిధ కార్యకలాపాల నిమిత్తం వచ్చే వాహనదారులకు ఇబ్బందులు కలిగించవద్దని, సేవలు సత్వరంగా అందేలా చూడాలని తెలిపారు. ఇక రవాణా శాఖ పన్నుల లక్ష్యం చేరుకోవడంపై అభినందిస్తూ మరింత వసూళ్లు చేపట్టి రాష్ట్ర స్థాయిలోనే మొదటి స్థానంలో నిలపాలని అన్నారు. డీటీఓ కిష్టయ్య, సీనియర్ ఎంవీఐ వివేకానంద్ రెడ్డి, ఎంవీఐలు రాహుల్‌కుమార్, యోగేశ్వర్ సింగ్, ఏఎంవీఐలు కొమ్ము శ్రీనివాస్, శ్రీకాంత్, ప్రత్యూషరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టులకు ఇంటర్వ్యూలు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని తొమ్మిది సబ్ సెంటర్లలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్(ఎంఎల్‌హెచ్‌పీ) పోస్టులకు ఈ నెల 31న ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఎంబీబీఎస్, బీఏఎంఎస్ చదివిన వారు అర్హులని, సర్వీసెస్‌లో ఉన్న వారి అభ్యర్థిత్వాన్ని పరిగణనలోకి తీసుకోబోమని తెలిపారు. ఉదయం 11 గంటలకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయని, ఒరిజినల్ సర్టిఫికేట్లు, ఒక జత జిరాక్సుతో హాజరు కావాలని తెలిపారు.

పేదలకు 200గజాల ఇంటి స్థలం



అభివాదం చేస్తున్న సీఎల్పీ నేత విక్రమార్క, గద్దర్, ప్రేంసాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

- ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షలు
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క

బెల్లంపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పేదలకు 200గజాల స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేస్తామని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క హామీనిచ్చారు. బుధవారం బెల్లంపల్లి కాంటా చౌరస్తాలో జరిగిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఇచ్చిన హామీల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏ ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. నీళ్లు, నిధులు, నియామకాలు 'కల్వకుంట్ల' కుటుంబానికే చెందుతున్నాయి తప్ప పేదల దరి చేరడం లేదని విమర్శించారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నప్రత్నాల లీకేజీ సర్వసాధారణమని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వ్యాఖ్యానించడం దారుణమని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో వేలాది ఎకరాల భూములు నీటమునిగినా పరిహారం మంజూరు చేకుండా రైతాంగాన్ని వంచించారని తెలిపారు.

ఐదు స్థానాలు స్థానికులకే ఇవ్వాలి
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాల్లో ఐదింటిని కాంగ్రెస్ పార్టీ స్థానికులకే ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ కె.ప్రేమ్‌సాగర్‌రావు కోరారు. ఎవరికిచ్చినా ఫర్వాలేదని, డబ్బులు లేకపోయినా ప్రజల గడువ పట్టుకుని ఓట్లడిగి గెలిపించుకుంటామని తెలిపారు. స్థానికులకు టిక్కెట్ ఇవ్వకుంటే ఏ పోరాటానికైనా సిద్ధపడతామని స్పష్టం చేశారు. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ఐదుగురు ఔత్సాహిక అభ్యర్థులు కాంగ్రెస్ టిక్కెట్ ఎవరికిచ్చినా గెలిపించుకుంటామని తెలిపారు. సీనియర్ నాయకుడు చిలుముల శంకర్, ఎంపీటీసీ ముడిమడుగుల మహేందర్, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి రొడ్డ శారద, సర్పంచ్ వేముల కృష్ణ, యువ నాయకుడు నాతరి స్వామిని సభ వేదికగా సీఎల్పీ నేత విక్రమార్కకు, సభకు హాజరైన ప్రజలకు పరిచయం చేసి కాంగ్రెస్ శ్రేణుల్లో ఆశలు నింపారు.

ఉత్సాహంగా
బెల్లంపల్లి శివారు కన్నాలలో మంగళవారం రాత్రి బస చేసిన విక్రమార్క రెండో రోజు బుధవారం సాయంత్రం 6 గంటలకు పాదయాత్ర ప్రారంభించారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు, పీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం.సూరిబాబు, కాంగ్రెస్ నాయకులు తొంగల మల్లేష్, బండి ప్రభాకర్, రొడ్డ శారద, నాతరి స్వామి, కత్తి కార్తీక, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆదర్శ్‌వర్దన్ రాజు పాల్గొన్నారు. పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపింది. పాదయాత్రలో ప్రజా గాయకుడు గద్దర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

నేడు సీతారాముల కళ్యాణ వేడుకల్లో..
భట్టి విక్రమార్క గురువారం బెల్లంపల్లిలో బస చేయనున్నారు. శ్రీరామనవమి కావడంతో పాదయాత్రకు విరామం ఇవ్వాలని నిర్ణయించారు. బెల్లంపల్లిలోని కోదండ రామాలయంలో జరిగే సీతారాముల కల్యాణ మహోత్సవంలో విక్రమార్క తన సతీమణి నందినితో కలిసి పాల్గొంటారు.

చిరుధాన్యాలపై అవగాహన కల్పించాలి



కర్ణమామిడిలో సామూహిక శ్రీమంతాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): చిరుధాన్యాలతో లభించే పోషకాలపై విద్యార్థినులు, మహిళలకు నిరంతరం అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ సూచించారు. బుధవారం హాజీపూర్ మండలం కర్ణమామిడి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిషోరబాలికలు, మహిళల్లో హెచ్‌బీ శాతాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ రక్తహీతనకు గురికాకుండా పౌష్టికాహారం తీసుకునేలా సూచనలు చేయాలని అన్నారు. చిరుధాన్యాల స్టాల్స్, సబ్బుతో చేతులు కడుక్కునే అంశాన్ని పరిశీలించారు. సర్పంచ్ కొట్టె మహేందర్, జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య, యూనిసెఫ్ డైరెక్టర్ శివాల్కర్, డీఎల్‌పీఓ ప్రభాకర్‌రావు, సీడీపీఓలు స్వరూపారాణి, రేష్మా, నోడల్ అధికారి హేమసత్య, కేజీబీవీ స్పెషల్ అధికారి ఏ.స్వప్న, పోషన్ అభియాన్ కో ఆర్డినేటర్ రజిత, డీపీఎం శ్యామల, గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు



మంచిర్యాల కేజీబీవీ నుంచి వెళ్తున్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. మార్చి 15 నుంచి ప్రారంభం కాగా చివరి రోజు ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ పరీక్షకు 6,910 విద్యార్థులకు గాను 6,601 మంది హాజరయ్యారు. 309 మంది గైర్హాజరయ్యారు. వీరిలో జనరల్ విద్యార్థులు 6,040 మందికి గాను 5,770 మంది హాజరు కాగా 270 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 870 మందికి గాను 831 హాజరు కాగా 39 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో శైలజ తెలిపారు. లక్సెట్టిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఇద్దరు విద్యార్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదైనట్లు తెలిపారు.

ఇంటిబాట పట్టిన విద్యార్థులు
పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఇంటిబాట పట్టారు. పరీక్ష కేంద్రాల నుంచి బయటకు రాగానే ఆనందాల్లో మునిగి తేలారు. తెల్లవారింది మొదలు అర్ధరాత్రి వరకు పుస్తకాలతో కుస్తీపట్టిన విద్యార్థులు ఉపశమనం పొందారు. వసతిగృహాల్లో ఉండే విద్యార్థులు ఇంటిబాట పట్టారు.

సీతారాముల కల్యాణం చూతమురారండి

- నేడు ఊరూరా కల్యాణ వేడుకలు
- ఆలయాల్లో పూర్తయిన ఏర్పాట్లు

మంచిర్యాలఅర్బన్: శ్రీరామనవమి సందర్భంగా జిల్లాలోని రామాలయాల్లో గురువారం సీతారాముల కల్యాణ వేడుకల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. మంచిర్యాలలోని గౌతమినగర్ కోదండరామాలయం, తిరుమలగిరి కాలనీలోని వెంకటేశ్వర స్వామి ఆలయం, ఏసీసీ, రైల్వేస్టేషన్ కోదండ రామాలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. బుధవారం గౌతమినగర్ కోదండ రామాలయంలో దైవ మూర్తులను ఎమ్మెల్యే దివాకర్‌రావు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ సిరిపురం రాజేశ్, కౌన్సిలర్లు నాంపల్లి మాధవి శ్రీనివాస్, పద్మకొండల్‌రావు పాల్గొన్నారు.


ఆలయాలు ముస్తాబు
దండేపల్లి/బెల్లంపల్లి/భీమారం/తాండూర్/భీమిని/చెన్నూర్‌రూరల్/జైపూర్: దండేపల్లి మండల కేంద్రంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో పచ్చని పందిరి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూజలు నిర్వహించారు. హనుమాన్ దీక్షా స్వాములు పాల్గొన్నారు. బెల్లంపల్లి కోదండ రామాలయంలో వేడుకల కోసం నిర్వాహక కమిటీ ఏర్పాట్లు చేసింది. దాదాపు లక్ష మంది వరకు భక్తులు హాజరయ్యే అవకాశం ఉండడంతో వసతులు కల్పించారు. భీమారంలోని కోదండ రామాలయంలో రూ.2.50 లక్షల వ్యయంతో ఆలయానికి రంగులు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. తాండూర్ మండలంలోని మాదారంటౌన్‌షిప్, కొత్తపల్లి, అచ్చులాపూర్, రేచినీ, కాసిపేట, బోయపల్లి, కిష్టంపేట గ్రామాల్లో ఆలయాల్లో కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేశారు. భీమిని, కన్నెపల్లి మండలాల్లో ఆలయాలను భక్తులు తీర్చిదిద్దుతున్నారు. జైపూర్ మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో కల్యాణ మహోత్సవానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

సుద్దాలలో పరిశీలన
చెన్నూర్‌రూరల్: మండలంలోని సుద్దాల గ్రామంలో సీతారామచంద్ర స్వామి ఆలయంలో సీతారాముల కళ్యాణోత్సవ ఏర్పాట్లను చెన్నూర్ పట్టణ సీఐ వాసుదేవరావు బుధవారం పరిశీలించారు. పార్కింగ్ స్థలాన్ని సందర్శించి సూచనలు చేశారు. ఆలయ అర్చకుడు అత్తిని మహేందర్‌శర్మ, బీఆర్‌ఎస్ నాయకులు పోలు రవి పాల్గొన్నారు.

ఎదుర్కోళ్లు..
మందమర్రిరూరల్/మంచిర్యాలఅర్బన్/తాండూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): మందమర్రి పట్టణంలోని యాపల్ ఏరియా రామాలయం, మూడో జోన్‌లోని సీతారామాలయం, పాలచెట్టు హనుమాన్ ఆలయంలో కల్యాణోత్సం నిర్వహించనున్నారు. హనుమాన్ ఆలయంలో నిర్వహించే కల్యాణానికి బుధవారం ఎస్సై చంద్రకుమార్ ఇంటి నుంచి, మూడో జోన్‌లోని రామాలయంలో కల్యాణానికి ఆలయ కమిటీ చైర్మన్, కేకే–5 గని మేనేజర్ భూశంకరయ్య ఇంటి వద్ద ఎదుర్కోలు కార్యక్రమం నిర్వహించారు. మంచిర్యాల గౌతమినగర్ కోదండ రామాలయంలో బుధవారం రాత్రి సీతారామచంద్రస్వామి ఎదుర్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక రథంపై దేవతామూర్తుల శోభాయాత్ర వీధుల గుండా ఆలయం వరకు సాగింది. ఆలయ కమిటీ చైర్మన్ సిరిపురం రాజేశ్, సభ్యులు పాల్గొన్నారు. తాండూర్ మండలం మాదారం టౌన్‌షిప్ కోదండ రామాలయంలో సీతారామచంద్రమూర్తుల ఎదుర్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మందనపు సరిత, రామారావు, భద్రపు రేఖ, వేణుకుమార్ దంపతులు పాల్గొనగా బ్రహ్మశ్రీ మొట్టు అవదూతశర్మ వేద మంత్రోచ్ఛరణల మధ్య సీతారాముల విగ్రహాలను ఊరేగింపు సాగింది. హాజీపూర్ మండలంలో సీతారాముల కల్యాణ ఉత్సవాలు బుధవార ప్రారంభమయ్యాయి. ఉదయం సీతారాముల కల్యాణ ఘట్టంలో భాగంగా పాలపొరక, మంగళస్నానాలు తలంబ్రాలు, ఎదుర్కొళ్ల వేడుకలా నిర్వహించారు. భక్తులు, మహిళలు మంగళహారతులతో పాల్గొన్నారు.



రామాలయంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు, కౌన్సిలర్లు



దండేపల్లిలో కొలువుదీరిన సీతారాములు



తాండూర్: సీతారామచంద్రుల విగ్రహాలతో ఊరేగింపు



మందమర్రి మూడో జోన్‌లో ఆలయం ముస్తాబు



ముల్కల్లలో మంగళ స్నానాలకు ఉత్సవ విగ్రహాలు

క్లుప్తంగా

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న టీబీజీకేఎస్ నాయకులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): శ్రీరాంపూర్‌లోని టింబర్‌యార్డు, ఏరియా స్టోర్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షులు డీ.అన్నయ్య, మంద మల్లారెడ్డి, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, కార్పొరేట్ చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కార్మికులను కలిసి సమస్యలు తెలుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ స్టోర్స్ మెటీరియల్ ఇస్యూవర్ రెండు పోస్టులు ఏళ్ల తరబడిగా భర్తీ చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆయూనియన్ డెప్యూటీ జనరల్ సెక్రటరీ చాట్ల అశోక్, నాయకులు కాశీరావు, అద్దు శ్రీనివాస్, జీ.సదానందం, నీరటి లక్ష్మణ్, రమణారావు, విష్ణుప్రసాద్, నిరంజన్‌రెడ్డి, కుమారస్వామి, ఎడ్ల వెంకటయ్య, లంక రామస్వామి పాల్గొన్నారు.

'డిస్మిస్ కార్మికులకు ఉద్యోగాలివ్వాలి'



మాట్లాడుతున్న రామిల్ల రాధిక

మందమర్రిరూరల్(చెన్నూర్): డిస్మిస్ కార్మికులకు ఉద్యోగాలివ్వాలని సంఘం అధ్యక్షురాలు రామిల్ల రాధిక డిమాండ్ చేశారు. బుధవారం వివిధ పార్టీల నాయకులతో కలిసి దీక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమకు ఉద్యోగ అవకాశం కల్పించాలని డిస్మిస్ కార్మికులు 19 సంవత్సరాలుగా దీక్ష చేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. ప్రతిరోజు దీక్షా శిబిరం ముందునుంచే కార్యకలాపాలకోసం వెళ్లే నాయకులు, అధికారులకు కార్మికుల గోడు కనిపించడంలేదన్నారు. సింగరేణి గుర్తింపు, సాధారణ ఎన్నికల్లో హామీ ఇచ్చి గెలిచిన తర్వాత ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉద్యోగాలు ఇచ్చేలా కృషి చేయాలన్నారు. ఆమె వెంట బీజేపీ నాయకులు నర్సింగ్, దీక్షితులు, సంఘం నాయకులు రవీందర్ ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

ఖానాపూర్: పట్టణంలోని గాంధీనగర్ శివారులోని పేకాట స్థావరంపై బుధవారం రాత్రి ఖానాపూర్ ఎస్సై ఆర్ శంకర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ముగ్గురి వద్ద నుంచి రూ.4500 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఫలం.. పోషకాలు పుష్కలం

- రోజా విరమణలో వినియోగం
- రంజాన్ మాసంలో ప్రత్యేకం



పోషకాలను ఇచ్చే పండ్లు

నెన్నెల(బెల్లంపల్లి): రంజాన్ మాసం వచ్చిందంటే పండ్లకు భలే గిరాకీ ఉంటుంది. ఇఫ్తార్ దీక్ష విరమణకు ముస్లింలు ఎక్కువగా పండ్లనే ఇష్టపడుతారు. ఎందుకంటే వాటిలో పోషకాలు అధికంగా ఉండడమే కారణం. సుమారు 15 గంటల పాటు ఉపవాసం ఉండి సాయంత్రం దీక్ష విరమణ సమయంలో పోషకాలు అధికంగా ఉండే ఫలాలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు పేర్కొంటున్నారు. తాజా పండ్లతో పాటు డ్రై ఫ్రూట్స్ తీసుకోవాలని సూచిస్తున్నారు.

పోషకాల ఖర్జూర..

ఖర్జూరలో తక్షణ శక్తినిచ్చే పోషకాలు ఉంటాయి. మహ్మద్ ప్రవక్త రంజాన్ ఉపవాస దీక్ష విరమణ సమయంలో వీటినే ఎక్కువగా తీసుకునే వారు. చాలా మంది సున్నత్(మహ్మద్ ప్రవక్త ఆచారం)లో భాగంగా ముందుగా ఖర్జూర పండ్లతోనే ఉపవాసదీక్షలు విరమిస్తారు. ఆ తర్వాతే ఇతర ఫలాలు తింటారు. ఈ క్రమంలో వాటి గిరాకీని తట్టుకునేందుకు రంజాన్ మాసంలో వ్యాపారులు విదేశాల నుంచి కూడా మేలు రకమైన ఖర్జూరను దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నారు. ఇందులో విటమిన్‌లు బీ–1, బీ–2, కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం ఉంటాయి.

శక్తినిచ్చే ఎండుఫలం

ఎండుఫలాలు మంచి శక్తినిస్తాయి. సౌదీలో ఎండు ఫలాలు అధికంగా లభిస్తాయి. మహ్మద్ ప్రవక్త దీక్ష విరమణ కోసం ఎండుఫలాలైన ఖర్జూర, కాజు, బాదం, పిస్తా, అక్రోట్‌లను అధికంగా తినేవారని చరిత్ర చెబుతోంది. ఈ ఎండు ఫలాల్లో అధిక పోషకాలు ఉంటాయి. దీంతో ముస్లింలు రోజా విరమణ కోసం ఇఫ్తార్‌లో వీటిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. తర్బూజ, కర్బూజ, బత్తాయి, ద్రాక్ష, సంత్రాలలో దాహం తీర్చే గుణాలు ఉంటాయి. విటమిన్లు, పీచు పదార్థాలు ఉంటాయి. అరటిలో విటమిన్–ఏ, కాల్షియం ఉంటాయని వైద్యులు పేర్కొంటున్నారు.

రోజా విరమణకు ఖర్జూర శ్రేష్ఠం



మహ్మద్ ప్రవక్త ఖర్జూర పండుతోనే రోజా విరమణ చేసే వారని ఖురాన్‌లో పేర్కొన్నారు. వీటిలో బీ–1, బీ–2, కాల్షియం, పోషక విలువలు మెండుగా ఉంటాయి. అందుకే వివిధ దేశాల్లో రోజు విరమణకు ముందుగా ఖర్జూరనే ఉపయోగిస్తారు.

– మహ్మద్ ఇబ్రహీం ఖాద్రి

డీహైడ్రేషన్ దూరం



రోజుకు సుమారు 15 గంటల పాటు అన్నపానియాలు ముట్టుకోకుండా కఠిన ఉపవాస దీక్ష ఉంటుంది. రోజా విరమణ సమయంలో పండ్లు తీసుకుంటే శక్తితో పాటు శరీరానికి కావాల్సిన నీటిశాతం అందుతుంది. ఇఫ్తార్‌లో పండ్లు తీసుకుంటే ఆహారం సులువుగా జీర్ణమవుతుంది. డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండేందుకు ఉపవాస దీక్ష విరమణకు పండ్లు తీసుకుంటారు.

– యూనిస్ రజాఖాద్రి హఫీజ్, బెల్లంపల్లి

పాత పింఛన్ విధానం పునరుద్ధరించాలి



నిరసన తెలుపుతున్న ఎల్ఐసీ ఉద్యోగులు

పాతమంచిర్యాల: ఉద్యోగుల జీవన భద్రతను హరిస్తున్న కొత్త పింఛన్ విధానం రద్దుచేసి బీమా సంస్థల ఉద్యోగులకు పాత పింఛన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా ప్రభుత్వ రంగ సంస్థల్లో సేవలు అందిస్తున్న ఉద్యోగుల పింఛన్ సొమ్మును ప్రభుత్వం స్టాక్ మార్కెట్‌లో పెట్టడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల బేసిక్ వేతనంలో 30 శాతం కనీస పింఛన్ చెల్లించాలని, ఎల్ఐసీ, జీఐసీల ప్రైవేటీకరణ ప్రయత్నాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీమా ఉద్యోగుల సంఘం మంచిర్యాల శాఖ అధ్యక్షుడు గోపీకృష్ణ, సంయుక్త కార్యదర్శి చరణ్, కరీంనగర్ డివిజన్ సంయుక్త కార్యదర్శి ఆర్ రాజేశం, తిరుపతిరెడ్డి, సమత్‌కుమార్, హిమశ్రీ,సోనీ, మౌనిక, సుష్మ, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారులంతా 'భగీరథ' నీటినే తాగాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులంతా మిషన్ భగీరథ నీటినే తాగేలా చర్యలు తీసుకోవాలని ఆమ్‌ఆద్మీ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ నయీంపాషా బుధవారం కలెక్టర్ బాదావత్ సంతోష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్, ఎమ్మెల్యే కార్యాలయాల్లో మిషన్ భగీరథ పైపులైన్లు వేసి నల్లా కనెక్షన్లు ఇచ్చి కలెక్టర్, ఎమ్మెల్యేతో సహా అధికారులంతా ఆనీటినే తాగాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశాల్లో మినరల్ వాటర్‌ను మాని మిషన్ భగీరథ నీటిని తాగి ప్రజలకు భరోసా కల్పించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లోకి మినరల్, ప్యూరిఫైడ్ వాటర్ అనుమతించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు నల్ల నాగేంద్రప్రసాద్, విజయ్, శ్రీకాంత్, కళ్యాణ్, రాజేందర్ పాల్గొన్నారు.

డీడీలు చెల్లించి ఇళ్ల పట్టాలు పొందాలి

- అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్



డీడీలు చెల్లించాలని సూచిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

రామకృష్ణాపూర్(చెన్నూర్): సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని క్రమబద్ధీకరణ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు వెంటనే డీడీలు చెల్లించి పట్టాలు పొందాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని డీడీలు చెల్లించని పలువురి ఇళ్లకు బుధవారం అదనపు కలెక్టర్‌తో పాటు ఇతర రెవెన్యూ అధికారులు వెళ్లి అవగాహన కల్పించారు. ఈ నెలాఖరుతో గడువు ముగియనుందని, వెంటనే డీడీలు చెల్లిస్తే ఇంటిపై సర్వహక్కులు పొందవచ్చన్నారు. ఆయన వెంట ఆర్డీవో వేణు, మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

కాలువ నీటిలో గల్లంతై యువకుడు మృతి



మల్లేశ్ మృతదేహం

దండేపల్లి(మంచిర్యాల): ప్రమాదవశాత్తు కాలువ నీటిలో గల్లంతై యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాంబమూర్తి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ముత్యంపేటకు చెందిన ఒర్సు మల్లేశ్ (22) బుధవారం సాయంత్రం మిత్రులతో కలిసి కాలువలో స్నానం చేసేందుకు వెళ్లాడు. లిఫ్టు డెలివరీ పాయింట్ సమీపంలోనే కాలువలోకి దిగి స్నానం చేస్తుండగా ఒక్కసారిగా నీటిప్రవాహం ఎక్కువ రావడంతో నీటిలో మునిగి గల్లంతయ్యాడు. గమనించిన మిత్రులు నీటిలో గాలించినా దొరకకపోవడంతో పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఎస్సై సాంబమూర్తి ఈతగాళ్ల సాయంతో కాల్వలో వెతికించగా మృతదేహం లభించింది. మృతదేహాన్ని లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గడువు తీరిన పాల ప్యాకెట్ల అమ్మకాలు!



గడువు తీరిన పాల ప్యాకెట్

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని కొర్విచెల్మలో ఓ కిరాణ దుకాణంలో గడువు తీరిన పాల ప్యాకెట్ల (సోయ పాలు) విక్రయం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన హనుమాన్ దీక్షాస్వాములు బుధవారం కిరాణ దుకాణంలో పూజాసామగ్రితో పాటు, పాలు కొనుగోలు చేశారు. దీంతో దుకాణం యజమాని వారికి గడువు తీరిన పాల ప్యాకెట్లు ఇవ్వడంతో వాటిని గమనించిన స్వాములు నివ్వెరపోయారు. పాల ప్యాకెట్ల గడువు గత నెల 27 వరకే ఉంది. గడువు ముగిసి నెల రోజులు దాటినా వాటినే ప్రజలకు విక్రయించడంపై మండి పడ్డారు. విషయాన్ని వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేశారు.

నెన్నెలలో పురాతన రాతి విగ్రహం లభ్యం



పూజలు చేస్తున్న స్వాములు

నెన్నెల(బెల్లంపల్లి): మండలం కేంద్రంలోని పెద్ద చెరువులో పురాతన వినాయక రాతి విగ్రహం ఉన్నట్లు హనుమాన్ దీక్షాపరులు గుర్తించారు. విగ్రహాన్ని బయటకు తీసి ఒక చెట్టు కింద ఉంచి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఇది సుమారు 800ల సంవత్సరాల క్రితం నాటిదని, చాళుక్యుల దేవాలయం గర్భగుడి ద్వారానికి పైభాగానికి సంబంధించిన రాతి విగ్రహమని గన్‌పూర్‌కు చెందిన చారిత్రక, పురావాస్తు పరిశోధకుడు పంజాల సాయిరాం తెలిపారు.

ఎడ్లు చోరీ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌కు చెందిన రైతులు వైరాగడే ఆనంద్‌రావు, వైరాగడే శ్రవణ్, మెంగ్రె బాబురావుకు చెందిన ఎడ్లు ఉదయం మేత కోసం బయటకు వెళ్లాయి. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో రైతులు శివారు ప్రాంతంలో వెతికేందుకు వెళ్లారు. ఈ క్రమంలో గుండి రహదారి సమీపంలోని ఒర్రె వద్ద మూడు ఎడ్లు చెట్టుకు కట్టేసి ఉండడంతో వాటిని వదిలేసి ఇంటికి తరలించారు. గతంలో సైతం జిల్లా కేంద్రానికి చెందిన పలువురి ఆవులు సైతం అదృశ్యమయ్యాయి. కొంత మంది వ్యక్తులు పశువులను బంధించి, కబేళాలకు తరలిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

అదుపుతప్పి లారీ బోల్తా..

భైంసాటౌన్: పట్టణంలోని భైంసా–బాసర రహదారిపై బుధవారం వేకువజామున లారీ అదుపుతప్పి బోల్తాపడింది. భైంసాలోని కాటన్ జిన్నింగ్ మిల్లు నుంచి పత్తి బేళ్ల లోడ్‌తో వెళ్తున్న లారీ స్థానిక హరియాలీ ఫంక్షన్‌హాల్ సమీపంలో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో లారీలో పత్తిబేళ్లు కింద పడిపోయాయి. డ్రైవర్, క్లీనర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. 161 బీబీ రహదారి పనుల్లో జాగ్రత్త చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, పనులు జరుగుతున్న చోట హెచ్చరిక సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చట్టాలపై ప్రజలకు అవగాహన ఉండాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

పాతమంచిర్యాల: పౌరహక్కులు, ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, ఆ దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, డీసీపీ సుధీర్ రాంనాద్ కేకన్, మంచిర్యాల, బెల్లంపల్లి, జైపూర్ ఏసీపీలు తిరుపతిరెడ్డి, సదయ్య, నరేందర్, ఆర్డీవోలు వేణు, శ్యామలాదేవి, జిల్లా షెడ్యూలు కులాల ఉపసంచాలకులు రవీందర్‌రెడ్డితో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. సివిల్ రైట్స్ డే సభలకు పంచాయతీరాజ్, పోలీస్, రెవెన్యూ, అటవీ, ఆరోగ్య, వ్యవసాయ సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యేలా చూడాలన్నారు. డీసీపీ సుధీర్‌రాంనాథ్‌కేకన్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులను 60 రోజుల్లోగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని, రెండు మూడు రోజుల్లో ఆదిలాబాద్ నుంచి అట్రాసిటీ కోర్టు మంచిర్యాలకు రానుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, డీఆర్డీవో శేషాద్రి, తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి

వేసవికాలం సమీపిస్తున్నందువల్ల మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో మిషన్ భగీరథ ముఖ్య అభియంత బీసీ జ్ఞానకుమార్‌తో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పైప్‌లైన్‌లు దెబ్బతిన్న ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన మరమ్మతు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రిడ్ ఈఈ మధుసూదన్, పీఆర్ ఈఈ ప్రకాష్, ఆర్అండ్ బీ ఈఈ రాము, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అగ్రిమెంట్ల ఉత్తర్వులు విడుదల చేయాలి

- సీఐటీయూ అధ్యక్షుడు రాజారెడ్డి



మాట్లాడుతున్న రాజారెడ్డి

శ్రీరాంపూర్(మంచిర్యాల): లేబర్ కమిషనర్ ఎదుట కార్మిక సంఘాలు, కంపెనీకి మధ్య జరిగిన అగ్రిమెంట్ల ఉత్తర్వులను యాజమాన్యం విడుదల చేయాలని సీఐటీయూ అధ్యక్షుడు టీ.రాజారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆర్కే5 గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కోలిండియాలో జరిగిన అగ్రిమెంట్లు అమలుకావడం లేదన్నారు. 2011లో అలవెన్సులపై ఐటీ మాఫీ చేసే ఒప్పందం అనంతరం క్యాడర్ స్కీం ఒప్పందాలను అమలు చేయలేదన్నారు. ఒప్పందాలు అమలు చేయకుండా ఎన్నికలు నిర్వహించి ఏం లాభమని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న చేపట్టనున్న 'చలో ఢిల్లీ' యాత్రను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచి అధ్యక్షుడు మిడివెల్లి శంకర్, సెక్రటరీ భాగ్యరాజ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ చంద్రశేఖర్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

ముల్కల్ల ఇటుకబట్టీలో చిన్నారి మృతి



రెడ్డి దీపిక (ఫైల్)

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల శివారులోని ఓ ఇటుకబట్టీలో రెడ్డి దీపిక(3) అనే చిన్నారి అస్వస్థతతో మృతి చెందిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. కోటపల్లి మండలం నక్కలపల్లికి చెందిన రెడ్డి శారద, రాములు దంపతులు ముల్కల్ల ఇటుక బట్టీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. దంపతుల కుమార్తె దీపిక మంగళవారం ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురైంది. వాంతులు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఇటుకబట్టి యజమాని గుట్టుచప్పుడుగా చిన్నారి మృతదేహాన్ని సొంతూరికి తరలించి అక్కడే అంత్యక్రియలు జరిపించారు. ఇటుకబట్టీల యజమానులు కూలీల ఆరోగ్యంపై పట్టించుకోకుండా వారి ప్రాణాలతో చెలగాలమాడుతున్నారని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. దీనిపై విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఎనిమిది ఇసుక ట్రాక్టర్లు సీజ్



మంచిర్యాలలో పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

మంచిర్యాలక్రైం: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న 8 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు మైనింగ్ ఏడీ బాలు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు బుధవారం తెల్లవారు జామున మైనింగ్ సిబ్బందితో కలిసి గోదావరి సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న 8 ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ట్రాక్టర్లను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

తాండూర్‌లో నాలుగు ...

తాండూర్(బెల్లంపల్లి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు మైనింగ్ ఏడీ బాలు తెలిపారు. తాండూర్ మండలం అచ్చులపూర్ శివారులోని వాగులో నుంచి కొందరు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని తమకు అందిన సమాచారం మేరకు మంగళవారం రాత్రి తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

'లీకేజీ'కి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

- టీజేఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.బాబన్న



మాట్లాడుతున్న టీజేఎస్ నాయకుడు బాబన్న

పాతమంచిర్యాల: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలంగాణ జనసమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.బాబన్న అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లీకేజీల వెనుక కేవలం ఇద్దరు ఉద్యోగుల హస్తం ఉందని మంత్రి కేటీఆర్ వాస్తవాలను పక్కదోవ పట్టించడమే అన్నారు. పాలకుల అసమర్థత వల్లే ప్రశ్నాపత్రాలు లీకేజీ అవుతున్నాయని, అది పెద్దల అండదండలతో ఒక వ్యాపారంగా ఎదిగిందన్నారు. ఫలితంగా విద్యార్థులు భవిష్యత్‌పై నమ్మకం కోల్పోయారన్నారు. కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంచందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోనేల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ప్రదీప్, విద్యార్థి యువజన సమితి జిల్లా అధ్యక్షుడు ఎండీ సిరాజ్, నాయకులు ప్రవీణ్, సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవి సత్యం, మున్సిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జైపాల్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

'ఔషధాల ధరల పెంపు ఉపసంహరించుకోవాలి'



మాట్లాడుతున్న మోతె రాజలింగు

పాతమంచిర్యాల: కేంద్ర ప్రభుత్వం ఔషధాల ధరల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని రైట్ టూ హెల్త్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మోతె రాజలింగు డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్య చికిత్సల్లో రోగులకు ఉపశమనం కలిగించే ఔషధాల ధరలను ఏప్రిల్ మాసం నుంచి పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందన్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం వలన లక్షలాది మంది పేదలపై భారం పడుతోందన్నారు. మందుల ధరల పెంపు నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిత్వ శాఖకు వినతిపత్రం పంపించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోశం, చిరంజీవి, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక క్వారీ పరిశీలించిన చీఫ్ సెక్యూరిటీ అధికారి



హద్దులు పరిశీలిస్తున్న చీఫ్ సెక్యూరిటీ అధికారి

చెన్నూర్: పట్టణం సమీపంలోని గోదావరినదిలో ఉన్న ఇసుక క్వారీని బుధవారం సింగరేణి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శశిధర్‌రావు పరిశీలించారు. సర్వేయర్ తిరుపతిని అడిగి హద్దులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి ఆస్తుల పరిరక్షణ కోసం సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడైన అక్రమాలు చోటు చేసుకుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ అజీమొద్దీన్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.